

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# మాకు సన్మానాలు వద్దు..

**సామాన్యుడికి సేవలే ముఖ్యం - ప్రజలకు మీ పనితీరుపై నమ్మకం కలగాలి**

**సర్టిఫికెట్ల జారీలో తాత్సారాన్ని సహించను**

**అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి దిశానిర్దేశం**

**ఇబ్రహీంపట్నంలో వివిధ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ**



రెవెన్యూ సమస్యలపై అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ఇబ్రహీంపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** మాకు పూలమాలలు, సన్మానాలు, సత్కారాలు వద్దు.. ప్రజలకు మీరు అందించే సేవలే ముఖ్యం. కార్యాలయానికి వచ్చే సామాన్యుడికి మీ పని తీరుపై నమ్మకం కలగాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ కార్యాలయాలను ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ ఫైళ్లను స్వయంగా పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సర్టిఫికెట్ల జారీలో తాత్సారం వద్దు..**

కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యంపై అడిషనల్ కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక కులం సర్టిఫికెట్ ఒక విద్యార్థి భవిష్యత్తును, ఒక నిరుద్యోగి జీవితాన్ని మార్చేస్తుంది.. అటువంటి కీలక పత్రాల విషయంలో నిర్లక్ష్యం వద్దు. పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును వెనువెంటనే పరిష్కరించాలి. ఆదాయ సర్టిఫికెట్ల కాపీలను పక్కాగా రికార్డుల్లో భద్రపరచాలని ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలో కుల సర్టిఫికెట్ల జారీపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని ఆయన గుర్తు చేశారు.

**భూ రికార్డులపై పట్టు సాధించాలి**

భూ సంబంధిత వ్యవహారాలపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని చంద్రారెడ్డి సూచించారు. భూభారతిని పైపైన చూస్తే ఏమీ అర్థం కాదు. సేత్వార్, కాస్రా పహానీలను క్షుణ్ణంగా పరిశీలిస్తేనే అసలు భూ సమస్యలు బోధపడతాయని భూమి కోసమే యుద్ధాలు జరిగాయి, జరుగుతున్నాయనీ వివరించారు. రైతులకు, బాధితులకు సరైన సమాధానం చెప్పేలా అధికారుల పనితనం ఉండాలని..భూసేకరణ చట్టాలను అవపోసన పట్టాలని చెప్పారు. సర్వే రిపోర్టులను సమగ్రంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా మండలంలో పెండింగ్ ఫైళ్లపై ఆయన స్పందిస్తూ.. 99 రోజుల ప్రణాళికకు ముందు 687 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కేవలం వారం రోజుల్లో వాటిని 200కి తగ్గించగలిగామని అడిషనల్ కలెక్టర్ మండల అధికారులను ప్రశంసించారు. ఈ నెల 10వ తేదీ నాటికి పెండింగ్ ఫైళ్లను జీరో చేయాలని లక్ష్యంగా విధించారు. ప్రస్తుతం మీసేవ ద్వారా భూ రికార్డులు, మ్యుటేషన్లు సహా 26 రకాల సేవలను వేగంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పారిశుధ్యం, ఫైళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనందరెడ్డి, ఏడిఏ సుజాత, తహసీల్దార్ సునితారెడ్డి, డిఏఓ ఉషా తదితరులున్నారు.

### నిబంధనలు ఉల్లంఘించిన

# బార్లపై కొరడా

**ఇబ్రహీంపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నిబంధనలు అతిక్రమించే వ్యాపార సంస్థలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సుచిర బార్ అండ్ రెస్టారెంట్‌లో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను వాడుతున్నట్లు గుర్తించారు. అలాగే పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటంతో యజమానికి జరిమానా విధించారు. అనంతరం బొంతపల్లి కుంట వద్ద ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఎస్‌జీ మహిళలతో కలిసి మొక్కలకు నీళ్లు పట్టారు. మున్సిపాలిటీలోని పబ్లిక్ టాయిలెట్లను సందర్శించి, వాటికి తక్షణమే రిపేర్లు చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ జానకి, ఈఈ ప్రణవ్ గౌడ్ మున్సిపల్ సిబ్బంది, ఎస్‌ఎస్‌జి మహిళలు పాల్గొన్నారు.

# చేతకాకపోతే పని మానుకోండి



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో భాగంగా లబ్ధిదారుడి నుంచి వివరాలు అడుగుతున్న హౌసింగ్ ఎండీ గౌతమ్ పొట్రు

**నిరక్ష్యం వహిస్తే సహించను - ఆఫీసులో రికార్డులు కూడా సరిగ్గా ఉంచరా?**

**మోడల్ ఇళ్లను ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎందుకు చూపించలేదు?**

**వాహనం లేదని సాకులు చెప్పి తప్పించుకుంటే కుదరదు**

**హౌసింగ్ సిబ్బందిపై ఎండి గౌతమ్ పొట్రు సీరియస్**

**ఇబ్రహీంపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ పొట్రు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించారు. మండల, మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కార్యాలయాల్లో అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో నిర్మించిన మోడల్ భవనాలను కేవలం రికార్డుల్లో దాచుకోవడానికి కాదని వార్డు ఆఫీసర్లు లేదా సర్వే అధికారులకు అప్పగిస్తే ప్రజలకు ఉపయోగపడతాయని సూచించారు. వార్డు అధికారులకు అప్పజెప్పడం వల్ల ప్రజలు వచ్చి ఈ మోడల్ భవనాలను తిలకిస్తారని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో తిరగాల్సిన హౌసింగ్ అధికారికి వాహనం లేదని, వార్డు సభ్యుల బైకులపై తిరుగుతున్నానని చెప్పడంపై ఎండీ ఘాటుగా స్పందించారు. వాహనం లేకపోతే లబ్ధిదారులకు ఎలా అందుబాటులో ఉంటారు? వాహనం లేదనే సాకుతో నిర్లక్ష్యం వహిస్తే కుదరదు.. చేతకాకపోతే వేరే పని చూసుకోండి అని హెచ్చరించారు. కనీసం ఆఫీసులో రికార్డులు కూడా సరిగ్గా లేకపోవడంపై ఆయన మండిపడ్డారు.

### పుస్తెలతాడు తాకట్టుపెట్టి

# అప్పు తెచ్చాం

**ఖర్చు రూ. 10 లక్షలు దాటిపోయింది - ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇల్లు పూర్తి కావడం లేదు - హౌసింగ్ ఎండి ఎదుట ఇందిరమ్మ లబ్ధిదారుల ఆవేదన**

ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలతో ఇల్లు పూర్తి కావడం లేదు సార్.. ఖర్చు అప్పుడే రూ. 10 లక్షలు దాటిపోయింది. ఆఖరికి మెడలోని పుస్తెలతాడు, ఉన్న బంగారం తాకట్టు పెట్టి అప్పు తెస్తేనే ఇల్లు నిలబడింది అని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ పొట్రు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించారు. మండల, మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించిన ఎండీకి క్షేత్రస్థాయిలో విస్తుపోయే విషయాలు ఎదురయ్యాయి. 5 లక్షలతో ఇల్లు పూర్తవుతుందా అని ఆయన ప్రశ్నించగా..ఏమీ రావడం లేదు సార్, అంతకంతకూ అప్పులే పెరుగుతున్నాయి అని లబ్ధిదారులు బదులిచ్చారు. ప్రభుత్వం సూచించిన మోడల్ హౌస్ ఎందుకు చూడలేదని ఆయన అడగ్గా..ఆ మోడల్ ప్రకారమే కట్టినా ఖర్చు రూ.10 లక్షలు దాటుతోందని చెప్పడంతో ఎండీ ఆశ్చర్య పోయారు.

ఈ పర్యటనలో హౌసింగ్ సీఈ చైతన్య, పీడీ చెంప్ల నాయక్, డీఈ సంపత్ కుమార్, ఎంపీడీవో ప్రమీల నాయక్, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, ఏఈ వైష్ణవి తదితరులున్నారు.



నీటి సంరక్షణ ఆవశ్యకతపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

### భూగర్భ జలవనరులను కాపాడటం

## ప్రతి ఒక్కరి బాధ్యత

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, ప్రభాతవార్త :** నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జల వనరులను కాపాడాలని, ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్రీయ భూగర్భజల బోర్డు, జలశక్తి మంత్రిత్వశాఖ, జలవనరులు, నదీ జిలాల అభివృద్ధి గంగా పునరుజ్జీవ విభాగం ఆధ్వర్యంలో సంబంధిత శాఖల ఇంజనీర్లు, క్షేత్ర సాంకేతిక సహాయకులకు భూగర్భ జలాలను సంరక్షించుకోవటంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ భూగర్భ మిగతా 2లో

# విత్యాల హైస్కూల్ హెచ్‌ఎంపై వేటు

**ఫలించిన విద్యార్థుల ఆందోళన**

**డ్యూటీకి నామం పెడుతున్న టీచర్లపై సీరియస్**

**ప్రధానోపాధ్యాడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు**

**పాఠాలు చెప్పే టీచర్లను ఇవ్వాలని చిన్నారుల విజ్ఞప్తి**



విత్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది తీరుపై విచారణ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** తమ భవిష్యత్తు కోసం గ్రామ విద్యార్థులు చేసిన పోరాటం ఫలించింది. పాఠశాలకు సక్రమంగా రాకుండా, విద్యార్థుల చదువులను నిర్లక్ష్యం చేస్తున్న విత్యాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రవిపై విద్యాశాఖ వేటు వేసింది. విద్యార్థులు మరియు గ్రామస్తుల ఆందోళనతో కదిలిన యంత్రాంగం, తక్షణమే విచారణ చేపట్టి సదరు హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫరూక్ నగర్ మండలం విత్యాల గ్రామంలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించే టీచర్ వ్యవహారంపై మంగళవారం విద్యార్థులు పాఠశాలకు తాళం వేసిన సంగతి విదితమే. ఈ ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో, ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగారు. తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ మరియు కమిషనర్ నవీన్ నికోలస్, జిల్లా విద్యాశాఖాధికారి సుసింధర్ రావు, ఫరూక్ నగర్ ఎంఈఓ మనోహర్ కలిసి బుధవారం విత్యాల ఉన్నత పాఠశాలను సందర్శించారు. అధికారుల బృందం విద్యార్థులతో, గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నారు. అన్ని కోణాల్లో విచారణ పూర్తి చేసిన అధికారులు, హెచ్‌ఎం రవి విధి నిర్వహణలో ఘోరంగా విఫలమయ్యారని నిర్ధారించారు. అక్రమ వసూళ్లు, నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదులు నిజమని తేలడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హెచ్‌ఎం రవిని ఉన్న ఫలంగా సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ నవీన్ నికోలస్ ప్రకటించారు.

**ఆనందంలో విద్యార్థులు....**



తమ గోడును విన్నందుకు మరియు తక్షణమే స్పందించినందుకు విద్యార్థులు, గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. "మాకు చదువు చెప్పే మంచి టీచర్లను పంపి, పదో తరగతి పరీక్షల్లో మేము పాస్ అయ్యేలా చూడాలి అని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్త ఆంగ్ల టీచర్‌గా అమరేందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్

### లక్ష్య సాధనలో బ్యాంకులు

## వేగం పెంచాలి

**- అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ ఆదేశం**

**రంగారెడ్డి అర్బన్, మార్చి 11, ప్రభాతావార్త :** జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలులో బ్యాంకులు చిత్తశుద్ధితో పనిచేయాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కె. శ్రీనివాస్ అన్నారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సూచనల మేరకు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సంప్రదింపుల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా సంభావ్య రుణ ప్రణాళికను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు మిగతా 2లో

### హోటల్ మురుగు నీటి దుర్గంధంపై

# కమిషనర్ ఫైర్

**రైతుల పొలాల్లోకి మళ్లించడంపై అసహనం**

**సెప్టిక్ ట్యాంకు నిర్మించుకోవాలని ఆదేశం**

**శామీర్‌పేట, మార్చి 11, ప్రభాతవార్త :** మజీద్‌పూర్‌లోని ఓ హోటల్ వెనకాల గల ఖాళీస్థలంలో ఆ హోటల్ మురికినీరును గుంత తీసి నిల్వ ఉంచటం, మురికి నీరును రైతుల పొలాల్లోకి వదలటంపై అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు ఎస్.వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డిలు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఆ హోటల్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి తనిఖీలు చేశారు. హోటల్‌లోని కిచెన్‌ను, వస్తువుల నిల్వలను, ఆహారపదార్థాలను పరిశీలించారు. హోటల్ మురికి నీరు వెనకాల గుంత తీసి నిల్వ ఉంచటం, కొంత మురికి నీరు పొలాల్లో పంపటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సెప్టిక్ ట్యాంకు నిర్మించాలని, పొలాల్లోకి మురికి నీరు వెళ్లకుండ చూడాలని వారు నిర్వాహకులకు స్పష్టం చేశారు. తుర్కపల్లి, మజీద్‌పూర్ గ్రామాల్లోని హోటల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించి పారిశుద్యకార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని హోటల్స్‌ను సందర్శించి పరిశుభ్రతపై ఆరా తీశారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని చైర్‌పర్సన్, కమిషనర్ స్పష్టం చేశారు. తుర్కపల్లిలోని శ్రీనిధి హోటల్‌ను, సానా గ్రాండ్ హోటల్‌ను, గ్రీన్‌సెవన్ హోటలను, అదే విధంగా మజీద్‌పూర్‌లోని బ్లూఫాక్స్ హోటల్‌ను వారు సందర్శించి కిచెన్‌షెడ్‌లను, ఆహారపదార్థాలను పరిశీలించి తనిఖీలు చేశారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవరించిన తుర్కపల్లిలోని సానా గ్రాండ్ హోటల్ వారికి 10వేల రూపాయలు, గ్రీన్‌సెవన్ హోటల్ వారికి 5వేల రూపాయలు, మజీద్‌పూర్‌లోని బ్లూఫాక్స్ హోటల్ వారికి 15వేల రూపాయలు జరిమానా విధించినట్లు కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. హోటల్స్ నిర్వాహకులు పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహారపదార్థాల నిల్వల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌లు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్లు ఎస్.వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, వెంకటేశ, దీపిక వరప్రసాద్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, నర్సింగ్‌రావుగౌడ్, సంబంధిత అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, విజయకుమార్, వేణుగోపాల్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మజీద్‌పూర్‌లో ఓ హోటల్ వెనక ఖాళీ స్థలంలో మురుగునీటిని పరిశీలిస్తున్నమున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు



తూంకుంటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తనిఖీ చేసి, తాళం ఉన్న వాటికి నోటీసులు అంటిస్తున్న అధికారులు

# ఖాళీగా ఉన్న ఇళ్లకు నోటీసులు

**శామీర్‌పేట, మార్చి 11, ప్రభాతవార్త :** తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను సంబంధిత జిహెచ్‌ఎంసి అధికారులు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని (జిహెచ్‌ఎంసి కీసర సర్కిల్‌లోని శామీర్‌పేట డివిజన్) తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను సంబంధిత జిహెచ్‌ఎంసి అధికారులు ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అయితే నగరంలోని ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల వారికి డబుల్‌బెడ్‌రూమ్స్ గత ప్రభుత్వంలో ఇండ్లను అలాట్ చేయటం జరిగింది. అయితే చాలా డబుల్‌బెడ్‌రూమ్స్ ఖాళీగ ఉండటంతో స్థానికంగ లేని వారి ఇళ్లకు నోటీసులను అంటించారు. లబ్దిదారులు ఇళ్లలో ఉంటున్నారా..లేదా అని, తాళాలు వేసి ఉన్న ఇళ్లకు అధికారులు నోటీసులు అంటించారు. లబ్దిదారులు తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చిన డబుల్‌బెడ్‌రూమ్‌లో ఉండాలని లేకుంటే చర్యలు తీసుకోవటం జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. సుమారు 350వరకు నోటీసులు రాగ, అందులో 60శాతం మంది సమాచారం ఉన్న వారు వచ్చి ఉన్నట్లు, ఇక తాళం ఉన్న ఇళ్లకు నోటీసులు అంటించటం జరిగిందని స్పష్టం అవుతుంది.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

**దౌల్తాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ చున్నితో ఉరేసుకొని మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని కుప్పగిరి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మండలంలోని కుప్పగిరి గ్రామానికి చెందిన గుండాల కృష్ణవేణి(29), భర్త చిన్న అశోక్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. గత రెండు నెలల క్రితం వారి ఇంటి ముందు ఉన్న భూమి జాగ కోసం కొంతమంది వ్యక్తులతో గొడవ జరగగా గ్రామంలో ఉండే పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకున్నారు. అయితే ఈనెల 9న మళ్లీ వారి మధ్య వాగ్వాదం సంభవించింది. బుధవారం ఉదయం ఇంటి ముందు కొటంలో దూలానికి కృష్ణవేణి ఉరి వేసుకుని విగతజీవురాలై కనిపించిందని ఆమె భర్త అశోక్ తెలిపారు. తమతో గొడవకు దిగిన వారే తన భార్య కృష్ణవేణి మృతికి కారకులై ఉంటారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించచారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు

**మృతురాలి బంధువులు ధర్నా**

మృతురాలి బంధువులు కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకొని కృష్ణవేణిది ఆత్మహత్య కాదని..గ్రామంలోనే కొంతమంది కొట్టి హత్య చేశారని వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆరోపిస్తూ కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డుపై ధర్నాకు దిగారు.

# జిల్లా ఆసుపత్రిలో మెరుగైన సేవలు

**మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి**

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



జిల్లా ఆసుపత్రిలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

**తాండూరు, మార్చి 11, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేలా దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసుపత్రిలో మౌళిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వార్డు, స్కానింగ్ రూం, జనరల్ వార్డు, ఐసిటిసి ల్యాబ్, డయాలసిస్ సెంటర్, మహిళా వార్డుతో పాటు వివిద విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎంతమంది వైద్యులు ఉన్నారు.. అవసరమైన మందులు ఉన్నాయా.. ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. అసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ వైద్యులకు సూచించారు. రోగులకు అందుబాటులో మిగతా 2లో

# నాణ్యత ఉన్న పదార్థాలనే వాడాలి

**మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ మనుచౌదరి ఆదేశం**

**ఘట్‌కేసర్, మార్చి 11, ప్రభాతవార్త:** విద్యార్థులకు మధ్యాహ్నభోజనం మెనూ ప్రకారం ప్రతిరోజు సమయానికి పౌష్టికాహారం అందించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ కైట్ కళాశాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తూ సమస్యలపై ఆరా తీశారు. వంటశాల, సామాన్ల నిల్వ గది, తరగతి గదులు, భోజనం వండుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు సమయానికి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. వసతి గృహంలో అందుతున్న బోధనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ గదిలో వంటసామాగ్రిని పరిశీలించి ఎక్స్పైరీ తేది లోగా వాడుకోవాలని, నాణ్యత కల్గిన వస్తువులనే వాడాలన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఫుట్‌బాల్, చెస్, వాలీబాల్, ఆర్ట్స్‌కు అవసరమైన పరికరాలు కావాలని సిబ్బంది కోరగా కలెక్టర్ స్పందించి అవరమైన ఆటవస్తువులు, పంరికరాలకు సంబంధించి ప్రతిపాదనలు తనకు పంపాలని తప్పకుండా అందిస్తానని తెలిపారు. కూచిపూడి, గిటారు, కీబోర్డు, పెయింటింగ్ విభాగాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, సర్టిఫికెట్ కోర్సులను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



పోతుగల్ లో నర్సరీని పరిశీలిస్తున్న చేవెళ్ల ఆర్డీవో పార్థసింహాద్రి తదితరులు

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**షాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహాద్రి అన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పోతు గల్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని ఇంకుడుగుంతలు, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీ, పల్లెప్రకృతి వనం, స్మశానవాటిక, డంపింగ్ యార్డును చూశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళకలో భాగంగా ప్రతి ఒక్కరూ పశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఆరుబయట చెత్త వేయరాదని, చెట్లను కాపాడుతే అవి మనకు మంచి గాలిని ఇస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఆపర్ణ, తహసీల్దార్ అన్వర్, ఎంపివో నాసరయ్య, సర్పంచ్ నర్సిం హులు, ఉపసర్పంచ్ సావిత్రి, పంచాయితీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి వనరులను సంరక్షించుకోవాలి

**సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య**

**షాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** నీటిని పొదుపుగా వాడుకుంటూ, జలవనరులను సంరక్షి ంచుకోవాలని సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం గ్రామంలోని రెండు ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సురక్షి త మంచినీటినే త్రాగాలని సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటిని ఇంటింటికి సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. భావి తరాలకు జల వనరులు పుష్కలంగా దక్కాలంటే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వాటర్ కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసు కోవాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ గణపురం ప్రభాకర్, వార్డు సభ్యులు సంతోష, జయమ్మ, బొగ్గుల సత్తయ్య, స్వప్న, నాయకులు కుమ్మరి శివ రాములు, చీమల వెంకటయ్య, పి. యాదయ్య, పాండరయ్య, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, వాటర్ సూపర్ వైజర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న సర్పంచ్ తదితరులు

## నేడు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో మహిళా జన్ సున్వాయ్

..జాతీయ మహిళా కమిషన్ విజయ రహత్కర్ రాక

..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజయ రహత్కర్ అధ్యక్షతన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమం గురువారం జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. 2026అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుర స్కరించుకుని మార్చి 8నుంచి 13వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్‌లు మహిళల సమస్యలను నేరుగా విని వారికి తక్షణ పరిష్కారం చూపేందుకు మహిళా సున్వాయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే మార్చి 12న గురువారం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా మహిళల సమస్యల ఫిర్యాదులను పరిశీలిస్తారని అన్నారు. వాక్ ఇన్ ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వివరించారు. ఈ సదా అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు.



ఎగ్జామ్ ప్యాడ్లు,పెన్నులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

## టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు,పెన్నులు పంపిణీ

**కొడంగల్,మార్చి 11,ప్రభాతవార్త:**

కొడంగల్ మండలం అంగడిరాయ్‌చూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో బుధవారంరోజు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ నాన్న ఫౌండేషన్ కొడంగల్ వారు ఎగ్జామ్ ప్యాడ్లను,పెన్నులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ఐదు సంవత్సరాల నుంచి ఫౌండేషన్ విద్యార్థులకు అనాథలకు ఎంతో మందికి అండగా నిలబడుతూ సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని,అందులో భాగంగా ఈ యొక్క విద్యార్థులు మంచి చదువులు చదువుకొని ఒక గొప్ప స్థాయికి వెళ్లాలని ఫౌండేషన్ కుటుంబ సభ్యులు కోరడం జరిగింది.తమవంతు సహాయంగా 55 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు,పెన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు,స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో వైభవంగా ప్రేరణ పురస్కారాల పండుగ

**క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు**



**ధారూర్, మార్చి 11, ప్రభాత వార్త:** మండల కేంద్రంలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రేరణ పురస్కారాల పండుగ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలు విద్యార్థుల ఉత్సాహం మధ్య అత్యంత విజయవంతంగా ముగిశాయి. మండలంలోని 8 పాఠశాలల విద్యార్థుల మధ్య జరిగిన ఈ పోటీలు వారిలో జ్ఞాన వికాసాన్ని, పోటీ స్ఫూర్తిని పెంపొందించాయి. ఈ కార్యక్రమానికి కుక్కిందా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాల స్థాయి నుంచే ఇలాంటి పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ క్విజ్ పోటీలను సీనియర్ మెంటర్ తుల్జప్ప, మెంటర్లు రాజేందర్ మరియు మహేశ్వరి సమన్వయకర్తలుగా వ్యవహరించి పర్యవేక్షించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో ఎంపీపీఎస్ నాగసముందర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ఎంపీపీఎస్ కుక్కిందా పాఠశాల ద్వితీయ స్థానంలో నిలవగా, కాచారం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గోకార్ట్ పోటీల్లో గురునానక్ ప్రతిభ

## జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన గురునానక్ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన 13వ జాతీయ స్థాయి ఈవీ గోకార్ట్ డిజైన్ ఛాలెంజ్‌లో గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా 80 కళాశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో ఎలక్ట్రిక్ వెహికల్ విభాగంలో వీరు 5వ స్థానాన్ని దక్కించుకున్నారు. విద్యార్థులు రూపొందించిన ఈ వాహనం గంటకు 100 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని, ఒక్కసారి ఛార్జ్ చేస్తే 100 కి.మీ. మైలేజ్ ఇస్తుందని కళాశాల వర్గాలు తెలిపాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ, ఎండి డా.హెచ్.ఎస్.సైని, ప్రిన్సిపాల్ డా.వెంకట రమణ రెడ్డి విద్యార్థులను అభినందించారు.




# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**– ఇబ్రహీంపట్నం ఎసిపి రాజు**

**ఇబ్రహీంపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ కేవీపీ రాజు, సిఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అంతా కలిసి స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.స్టేషన్ లోపల, బయట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మన ఇల్లు, ఊరిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో, ప్రజల కోసం నిరంతరం పనిచేసే పోలీస్ స్టేషన్లను కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను అలవాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పోలీస్ అధికారులు

## నేడు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పై శిక్షణ

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని గౌళికార్ ఫంక్షన్ హాలు లో సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



జిల్లా కలెక్టర్ దీపక్న తివారి

## విడిపోయినా తప్పని తిప్పలు

**సరిహద్దుల పంచాయతీ షురూ**



తాహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి.

**నందిగామ, మార్చి 11, ప్రభాతవార్త:** ఉమ్మడి నందిగామ గ్రామ పంచాయతీ నుండి విడిపోయిన అంతిరెడ్డిగూడెం కు సరికొత్త సమస్య ఎదురయింది. నందిగామ నుండి వేరు చేయాలని గల్లీలో పోరాట ప్రస్థానం మొదలై ఢిల్లీ దాక వెళ్లి సాధించుకున్న అంతిరెడ్డి గూడ గ్రామపంచాయతీ ప్రస్తుతం సరిహద్దుల సమస్యలతో సతమతమవుతుంది. కొత్తగా అవతరించి సర్పంచ్ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గం కొలువుతీరిన ఇంకా సరిహద్దుల సమస్య వెంటాడుతుందని, పరిపాలన సౌలభ్య రిత్యా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మా సమస్యను పరిష్కరించి స్వేచ్ఛని ఇవ్వమని సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు నందిగామ తహసిల్దార్ ను ప్రాదేయ పడుతూ వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి నందిగామ గ్రామపంచాయతీ నుండి అన్నదమ్ములా విడిపోయిన సరిహద్దుల సమస్య తలనొప్పిని తెచ్చిపెడుతుందని వారు రెవెన్యూ అధికారి ముందు విచారం వెలిబుచ్చారు. ఎమ్మార్వో ను కలిసిన వారిలో వార్డు సభ్యులు ఎంబడి అంజి యాదవ్, గడ్డల శ్రీశైలం, ఆంజనేయులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



మహిళా దినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న చైర్‌పర్సన్ గడ్డం అనన్య

## మహిళా దినోత్సవ వేడుకల్లో చైర్‌పర్సన్ అనన్య

**వికారాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వికారాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో సత్యభారతి ఫంక్షన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య హాజరయ్యారు.మహిళ ప్రజాప్రతినిధులకు గేమ్స్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజశారు. అనంతరం మహిళా దినోత్సవ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయంగా సైతం రాణించినట్లైతే మహిళలకు పూర్తి స్థాయిలో న్యాయం చేకూరుతుందని అన్నారు. మహిళల హక్కులకు భంగం కలుగకుండా మహిళా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, స్థానికకౌన్సిలర్లు, పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో బ్యాంకులు వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమల,విద్యా రుణాల మంజూరులో జాప్యం జరగకుండా చూడాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు క్రెడిట్ అందించడంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రుణాలు సకాలంలో మంజూరు చేసి పంపిణీ చేయడం ద్వారానే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.జిల్లాలో ఆర్థిక చేరికను వేగవంతం చేయడానికి ప్రభుత్వ విభాగాలు, బ్యాంకుల మధ్య పటిష్టమైన సమన్వయం ఉండాలని చెప్పారు. రుణ ప్రాసెసింగ్‌లో ఉన్న అడ్డంకులను తొలగించి, క్షేత్రస్థాయిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ, నాబార్డ్ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం ఆర్టీసి బస్ బస్టాండ్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం,మార్చి 11, ప్రభాతవార్త :** ప్రయాణాల్లో ఉన్న తల్లులకు సౌకర్యార్థం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసిబిడ్డల ఆకలి తీర్చే క్రమంలో తల్లులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రంగారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్టీజి డిఎం సుజాత, తహసీల్దార్ సునితా, సిడిపిఓ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ఘట్‌కేసర్, మార్చి 11, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి మైసమ్మగుట్ట వద్ద వందన హోటల్ ఎదురుగా డివైడర్‌పై ఒక గుర్తుతెలియని వ్యక్తి శవం ఉందని సమాచారం రావడంతో పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 25 సంవత్సరాలు ఉంటుందని, ఏలాంటి దుస్తులు ధరించకుండా ఉన్నాడని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి కోసం స్థానికంగా విచారించగా అతడు గత మూడురోజుల క్రితం పరిసరాల్లో బట్టలు లేకుండా రాత్రి సమయంలో తిరుగుతుండగా చుట్టుపక్కల వారు అతనికి దుస్తులు, ఆహారం ఇచ్చినా తీసు కోలేదని తెలిపారని ఆచూకి వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు. మృతుని ఎత్తు 5.'4 అడుగులు ఉంటాడని చామనచాయ రంగు, ముస్లీం లాగా ఉన్నాడని, అతడి శరీరంపై కొన్ని చిన్న పాతగాయాలు కనిపిస్తున్నాయని తెలిపారు. హెచ్‌పి పెట్రోల్ బందు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామని మృతుని సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ తెలిపారు.

## భూగర్భ జలాలను కాపాడటం అందరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

జలాల సంరక్షణకు సంబంధించి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తారని, వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు కావటానికి, కాపాడుకోవటానికి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ఇంకుడు గుంతలు, నీటికుంటలు తదితర నిర్మాణాలు ఉపయోగపడుతాయని అన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఇలాంటి శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలు సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాలను పెంచేందుకు ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. దీనిలో సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్త డాక్టర్ పండిట్ మధునూర్, సీనియర్ సైంటిస్టు డాక్టర్ సుధీర్‌బాబులు పలు సూచనలు అందించగా, జిల్లా భూగర్భజల అధికారి ఎం.హరీష్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఆ తరువాత కేంద్రీయ భూగర్భజల మండలి, భూగర్భ జలశాఖ మేడ్చల్ జిల్లా వారి ఆధ్వర్యంలో ముద్రించిన అక్విఫర్ మేనేజ్‌మెంట్,భూగర్భ జల నివేదికను విచ్చేసిన అతిథులు ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్తలు మాదవ్, యాదయ్య, రాంబాబు, అమన్‌జైన్, భూగర్భజల శాఖ నుంచి సత్యనారాయణ,వంశీకృష్ణ, కార్తీక ప్రియ, కమల కుమారి, కార్తీక్, రాకేశ్, పవన్‌కుమార్, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సాంబశివరావు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిలో మెరుగైన సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఉండేలా సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ఆసుపత్రిలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రిలో తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తాండూరు మండలం గౌతాపూర్, చెంగోల్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామ పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, ఇతర మౌళిక సదుపాయాలు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గౌతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సదర్శించారు. పాఠశాలలో విద్యార్థుల భోదనపై ఆరాతీశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, తాండూరు ఆర్డీఓ అనిత, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసిల్దార్ తారాసింగ్, వివిధ శాఖల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

# రూ.30 లక్షలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇల్లు గూడు లేని నిరుపేదలకు వరాల జల్లు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బుధవారం గృహప్రవేశం అంగరంగ వైభవంగా చేయించారు. కార్యక్రమం కోసం లింగారెడ్డిగూడెం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రావడంతో గ్రామవాసి స్థానిక మాజీ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ తన ఆప్యాయతను చాటారు. ఎమ్మెల్యే శంకర్ సైతం అంతే వినమ్రంగ ఆయనకు నమస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు దంపతులకు నూతన దుస్తులు పెట్టి ఆశీస్సులు అందించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలను ఇంటి యజమానులను చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దానిని అంకితభావంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటిని అందించి వారికి గూడు చూపించే కార్యక్రమం మంచి కార్యక్రమం అని అభినందించారు. సర్పంచ్ ఎంసీ రాజు, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రగతి పనులకు శంకుస్థాపన.. అదేవిధంగా గ్రామంలో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, దీపిక, వీరేష్ గౌడ్, మమత, అరుణ్, సాయికుమార్, బాలమణి, యాదయ్య, మాధవి, గణేష్, మెహరాజ్, శశాంక్, గ్రామ పెద్దలు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్, భాస్కర్ రెడ్డి, పంతులు, లక్ష్మయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, సుధాకర్, ధనాల రాజు యాదవ్, ధనుంజయ గౌడ్, పక్కని శీను, యాదయ్య గౌడ్, మంగలి మల్లేష్, శంకరయ్య, అంజయ్య ప్రతాపరెడ్డి, దాదేమియా, జంగయ్య, నారాయణ, శీను, శేఖర్, యాదగిరి, ఖదీర్ ,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో భూగర్భ జలాల సంరక్షణపై శిక్షణా కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జ్యోతి వెలిగించి ప్రారంభించిన దృశ్యం

# నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జలవనరులను కాపాడాలి

**..ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలి**

**..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, ప్రభాతవార్త**

నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జలవనరులను కాపాడాలని, ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్రీయ భూగర్భజల బోర్డు, జలశక్తి మంత్రిత్వశాఖ, జలవనరులు,నదీ జిలాల అభివృద్ధి గంగా పునరుజ్జీవ విభాగం ఆధ్వర్యంలో సంబంధిత శాఖల ఇంజనీర్ల, క్షేత్ర సాంకేతిక సహాయకులకు భూగర్భ జలాలను సంరక్షించుకోవటంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణకు సంబంధించి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తారని, వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు కావటానికి, కాపాడుకోవటానికి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ఇంకుడు గుంతలు, నీటికుంటలు తదితర నిర్మాణాలు ఉపయోగపడుతాయని అన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఇలాంటి శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలు సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాలను పెంచేందుకు ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. దీనిలో సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్త డాక్టర్ పండిట్ మధునూర్, సీనియర్ సైంటిస్టు డాక్టర్ సుధీర్‌బాబులు పలు సూచనలు అందించగా, జిల్లా భూగర్భజల అధికారి ఎం.హరీష్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఆ తరువాత కేంద్రీయ భూగర్భజల మండలి, భూగర్భ జలశాఖ మేడ్చల్ జిల్లా వారి ఆధ్వర్యంలో ముద్రించిన అక్విఫర్ మేనేజ్‌మెంట్,భూగర్భ జల నివేదికను విచ్చేసిన అతిథులు ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్తలు మాదవ్, యాదయ్య, రాంబాబు, అమన్‌జైన్, భూగర్భజల శాఖ నుంచి సత్యనారాయణ,వంశీకృష్ణ, కార్తీక ప్రియ, కమల కుమారి, కార్తీక్, రాకేశ్, పవన్‌కుమార్, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సాంబశివరావు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




నీటి సంరక్షణ కొరకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,పాల్గొన్న పలువురు అధికారులు


తుపాకుల తాండలో నూతన బోరు వేయిస్తున్న సర్పంచ్

## తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం
**సర్పంచ్ దివ్య శంకర్ నాయక్**

కుల్కచర్ల,మార్చి 11 ప్రభాతవార్త : గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యల తీసుకుంటామని సర్పంచ్ సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బండమిది తండా గ్రామ పంచాయతీ అనుబంధమైన తుపాకుల తాండలో నూతన బోరు వేయించారు. అ నంతరం రోడ్లను చదును చేయించి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని గ్రామంలో నీటిసమస్య ఎక్కడ ఉన్నా వెంటనే పరిష్కరిస్తునట్లు తెలిపారు.తాగు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నమని పేర్కొన్నారు.ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపు వాడుకోవాలని సూచించారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు తప్పని సరి
**సర్పంచ్ చంద్రభూపాల్ రావు**


పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు వేస్తున్న వైద్యులు

**కుల్కచర్ల,మార్చి 11, ప్రభాతవార్త:** పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు తప్పని సరిగా వేయించాలని సర్పంచ్ చంద్రభూపాల్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో పశు వైద్య అధికారులతో కలిసి పశువులుకు గాలి కుంట వ్యాధి నివారణ మందులు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులను పోషించే ప్రతి రైతు పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకో వాలని సూచించారు.తప్పని సరిగా పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం
**సర్పంచ్ రవీందర్ నాయక్**


సిసి రోడ్లు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,మార్చి 11, ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని సర్పంచ్ రవిందర్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిది. లోని చెరువుముందలి తాండ (ఎ)లో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..కాంగ్రెస్‌ప్రభుత్వంలో వెనుకపడ్డ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.తమపరిధిలో ఉన్న తాండలను అభివృద్ధిచేసి అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ టోప్య నాయక్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలను రక్షించుకోవడం అందరి బాధ్యత


పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

కేశంపేట, మార్చి 11, ప్రభాతవార్త : మూగజీవాలను రక్షి ంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు రోగాల నివారణ మందు పంపిణీ చేసిన మండల వైద్యాధికారి డా నివేదిత పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్తగా ఈ టీకాలు వేయించాలని అన్నారు. ఈ టీకాలను వేయించడం ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ ఆనంద్ కుమార్ రైతులకు తెలిపారు.

## రైతులకు మెరుగైన సేవలందించాలి


యువజన సంఘాల నాయకులు విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**చౌడపూర్ ,మార్చి 11, ప్రభాతవార్త :** చౌడాపూర్ మండల కేంద్రంలో వికారాబాద్ జిల్లా స్థాయిలో ఏర్పాటైన ఏఈఓల ఆధ్వర్యాన జిల్లా వ్యవసాయ జెఏసి కోశాధికారిగా చౌడపూర్ క్లస్టర్ ఏఈఓ విశ్వనాథ్ నియమితులయ్యారు.చౌడపూర్ యువజన సంఘాల నాయకులు విశ్వనాథ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.. కేంద్రంలోగల రైతులకు మరిన్ని మెరుగైన సేవలందించాలని వారిని కోరారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్, శ్రావణ్‌ఖి కళ్యాణ్, నరేష్ , నర్సింలు అశోక్, బోయిని బాలరాజ్, జంగయ్య, పవన్ రెడ్డి, భూపతి రెడ్డి, నరేష్, బుచ్చా నాయక్ యువకులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తాం

**చౌడపూర్ ,మార్చి 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మక్తవెంకటాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామని , నిధులను పూర్తిగా గ్రామ అభివృద్ధికి సద్వినియోగం చేసుకుంటామని సర్పంచ్ కవితహరినాథ్ తెలిపారు.బుధవారం గ్రామంలో పంచాయితి నిధులనుంచి అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్ , ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, వార్డుమెంబర్లు నూర్యా, హర్యా, కిషన్ బుద్దా, గ్రామ పెద్దలు వెంకట్, రామారావు, లాలూ పాల్గొన్నారు

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


కార్యక్రమంలో వైద్యాధికారి రేఖ సహాయకులు

**యాచారం,మార్చి 10, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి, గడ్డమల్లయ గూడా, యాచారం గ్రామాలలో మంగళవారం మండల పశువైద్య ఆధికారి రేఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి టీకాలను 10 మార్చ్ నుండి 9 ఏప్రిల్ వరకు కొనసాగుతాయని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు సుమారు 260 పశువులకు టీకాలు అందజేసినట్లు తెలిపారు. 16 మంది రైతులకు సంబంధించిన పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు వీరారెడ్డి , కృష్ణమాచారి, జహంగీర్, వెంకటయ్య, సహాయకులు వసంత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలి
**ఎంపిడిఓ రాధారాణి**


ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న ఎంపిడిఓ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు

**యాచారం,మార్చి 10, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం కావాలంటే గ్రామాలలో ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలి అని ఎంపిడిఓ రాధారాణి కోరారు. మంగళవారం మండల పరిధిలోని అయ్యవారిగూడ గ్రామంలో ఎంపీడీవో ఇన్చార్జ్ ఎంపిఓ తిరుపతయ్య తొ కలిసి పర్యటించి సర్పంచ్ వార్డు సభ్యులు పనులను సమీక్షి ంచారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పరిసరాల పరిశుభ్రత త్రాగునీటి వనరులపై సమాచారం తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శులు వార్డు సభ్యులు ప్రణాళికలో భాగస్వాములై విజయవంతం చేయాలని సూచన చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి నిర్లక్ష ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రావిర్యాల పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**జిల్లెడు చౌదరిగూడ,మార్చి 11,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుదవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులుగా వ్యవహరించారు.డిఈఓగా సిద్దార్,ఎంఈఓగా అభిరామ్, ప్రధానోపాధ్యాయురాలుగా కీర్తనలు విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పవన్ కుమార్, వీరసముద్రం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు శివాజీ, రాములు, అఫ్రీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు బదిలీ
**ఆమన్ గల్ పోలీస్ స్టేషన్‌కు డిఐ వెంకటేశ్వర్లు**

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్ వెంకటేశ్వర్లకు బదిలీ జరిగింది. ఆయనను ఆమన్ గల్ కు బదిలీ చేస్తూ ఫ్యూచర్ సిటి కమిషనరేట్ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. రంగారెడ్డి జిల్లాలో ఆరు పోలీస్ స్టేషన్ లకు సంబంధించి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే డిఐ వెంకటేశ్వర్లు స్థానంలో మరో అధికారిని నియమించలేదు. అదేవిధంగా ఇక్కడ సిఐగా పనిచేసే వెళ్లిన విజయ్ కుమార్ ను అటాచ్ చేసిన కమిషనర్ ఆ తర్వాత ఆర్థిక నేరాల విభాగానికి

# జిల్లా స్థాయిలో మెరిసిన క్రీడా రత్నాలు
**మండల విద్యాధికారి ఎం.చంద్రశేఖర్**


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మండల విద్యాధికారి ,ఉపాధ్యాయులు

**కేశంపేట, మార్చి 11, ప్రభాతవార్త :** సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా లోని 41 పియం శ్రీ పాఠశాలలకు జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. బాలికలు ఖోఖో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మొదటి బహుమతి గెలుచుకున్నారు. అథ్లెటిక్స్ బాలికల విభాగంలో 100 మీటర్స్ పరుగు పందెంలో పి.సుప్రియ ప్రథమ బహుమతి, ఏ.వైష్ణవి తృతీయ బహుమతి సాధించగా, లాంగ్ జంపులో బి.వైష్ణవి మొదటి బహుమతి సాధించింది. షార్ట్ ఫుట్ బాలికల విభాగంలో ఆర్. అక్షి త ద్వితీయ బహుమతి సాధిం చింది. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని కొత్తపేట పాఠశాలకు పేరు తేవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశపేట మం డల విద్యాధికారి అయిన ఎం చంద్రశేఖర్ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల విజయాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ పోటీలకు సహకరించిన కోచ్ జి నరేష్, పిడియు గౌరీకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం


విద్యార్థులకు స్టేషనరీని అందజేస్తున్న కంచర్ల శేఖర్

## విద్యార్థులకు ప్యాడ్లు పెన్నుల అందజేత

**మొయినాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ, హిమాయత్‌నగర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులకు దాత కంజర్ల శేఖర్ ఆర్థిక సహాయంతో ప్యాడ్లు పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ 10వతరగతి విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో తన వంతు సహాయం చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు బాగాచదివి ఉత్సవమార్కులు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అలీ, కంజర్ల సుమన్ కుమార్, బురకాయల రమేష్, మాల స్వామి, పూడూరు ప్రవీణ్ కుమార్, కామరెడ్డి కుమార్, పైలి సుమన్, పూడూరు ప్రసాద్, కుశంగల నవీన్ కుమార్, పూడూరు అన్సుల్, గునుగుర్తి చరణ్, కట్టమీద పృథ్వీ రాజ్, కంజర్ల ప్రమోద్, కంజర్ల రోహిత్, గుణుగుర్తి అరుణ్, జెటికేని రోహిత్, జెటికేని రోహన్, కంజర్ల రోషన్, కట్టమీద అన్వేష్, కంజర్ల హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**షాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చందనవెల్లిలో బుధవారం ప్రత్యేకమైన వైద్య బృందం చేత ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలరని ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై దృష్టి పెట్టాలన్నారు. వైద్య శిబిరంలో ఆరుగురు ప్రత్యేక డిపార్ట్మెంట్ డాక్టర్లచే 315 రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వైద్య అధికారి లలితాదేవి, చేవెళ్ల ఆర్డీవో, షాబాద్ మండల్ ఎమ్మార్వో, ఎంపీడీవో, చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, షాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులవారు కావలి చంద్రశేఖర్, సర్పంచ్ నవనీత స్వామి, చందన వెల్లి వైద్య అధికారి కె ప్రణీత్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యత
**ఐసీటీ రాష్ట్ర అకాడమీ హెడ్ గోపాల్**


.అనురాగ్ యూనివర్శిటీలో ఐబీఎం అడ్వాన్స్‌డ్ ఐటీ స్కిల్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఐసీటీ రాష్ట్ర అకాడమీ హెడ్ గోపాల్ తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 11, ప్రభాత వార్త:** నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఉందని విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని డిజిటల్ భద్రతకు తోడ్పడాలని ఐసీటీ అకాడమీ రాష్ట్ర అధిపతి గోపాల్ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో సైబర్ సెక్యూరిటీపై సర్టిఫికేట్ కోర్సు పేరుతో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసిన ఐసీటీ అకాడమీ అధిపతి గోపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించి భవిష్యత్ కేరీర్‌కు తోడ్పటునందిస్తాయని అన్నారు. ఈ తరహా కార్యక్రమాల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ వి. విజయ్‌కుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్. డాక్టర్ జి. విష్ణుమూర్తి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డి. రమణ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ పి.వి. శివప్రసాద్, జె. కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అందె బాబయ్య

## ఫరూక్ నగర్ మండల్ ప్రశిక్షణ ప్రిపరేషన్ మీటింగ్

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని ఏబి కాంప్లెక్స్ లో ఫరూక్నగర్ మండలం ప్రిపరేషన్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశాన్ని పిట్టల సురేష్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు అందె బాబయ్య బిజెపి షాద్నగర్ ఇంచార్జ్ కక్కునూరి వెంకటేష్ గుప్తా పాల్గొన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరాన్ని మండలంలో విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో వెంకనోల వెంకటేష్ లస్కర్ నాయక్ వినోద్ నాయక్ బోయ కురుమయ్య నువ్వు బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత
**విట్యాల సర్పంచ్ వెంకటయ్య**


పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం విట్యాల గ్రామంలో సర్పంచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజ లకు అవగాహన కల్పించడం జరి గింది. గ్రామంలో ఉన్న ఓహెచ్ ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను శుభ్ర పరచడం జరిగింది. మరియు క్లోరినేషన్ చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా సర్పంచ్ వెంకటయ్య మాట్లా డుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులను దరిచేరకుండా గ్రామాన్ని అభివృద్ధి పరచుకోవాలని ప్రజలను కోరారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని అందరూ సహకరించాలని కోరారు.

## అక్రమ కట్టడాలను తొలగించండి


మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బిజెపి మండల అధ్యక్షురాలు గండేటి గాయత్రిగౌడ్

**శంకర్‌పల్లి, మార్చి 11, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని బిజెపి మహిళా మండల అధ్యక్షురాలు గండేటి గాయత్రిగౌడ్ కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాల యానికి వెళ్లి సంబంధిత అధికారుల కు బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో 2021 లో ఫిర్యాదు ఇస్తే ఇప్పటివరకు అక్రమకట్టడాలను తొలగించలేదని, మున్సిపల్అధికారులు నిర్లక్ష ్యం వహించకుండా అక్రమ కట్టడాలను తొలగించాలని లేనిపక్షంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**కొడంగల్ రూరల్, మార్చి 11 (ప్రభాతవార్త):** కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కరాటే, వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్సై చేతుల మీదుగా పాఠశాల వ్యవస్థాపకులు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డి.వీ.నరేశ్‌రాజ్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**కొడంగల్ రూరల్, మార్చి 11 (ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం కొడంగల్ మండల పరిధిలోని ఉడమేశ్వరం గ్రామంలో సిసిరోడ్డుపనులను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూర్ చేస్తుందని తెలిపారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.శ్రీనివాస్, ఉప సర్పంచ్ నరేందర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సదస్సుకు అంగడిరైచూర్ సర్పంచ్



జాతీయ మహిళా సదస్సుకు హాజరైన సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మి,ఎంపిడిఓ పీడీఓ ఉషశ్రీ

**కొడంగల్,మార్చి 11,ప్రభాతవార్త :** జాతీయ మహిళా సదస్సులో మండల పరిధిలోని అంగడిరైచూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మీనాగప్ప పాల్గొననున్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ మహిళా సదస్సులో అంగడిరైచూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మీనాగప్ప పాల్గొనేందుకు ఢిల్లీకి తరలివెళ్ళారు.ఈ జాతీయ సదస్సుకు తెలంగాణా రాష్ట్రం నుంచి 17 మంది మహిళా సర్పంచులు,5గురు అధికారులు తెలంగాణా రాష్ట్రం నుండి హాజరుకానున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయగా అందులో వికారాబాద్ జిల్లా తరపున కొడంగల్ మండలం అంగడిరైచూర్‌కు చెందిన మహిళా సర్పంచ్ హాజరుకానున్నారు.ఇట్టి మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సుకు రాష్ట్రపతి వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు.ఈ సదస్సుకు సర్పంచ్‌తో పాటు కొడంగల్ ఎంపీడీఓ ఉషశ్రీ హజరవుతున్నందుకు గ్రామస్థులుసంభందిత అధికారులు,మండల,జిల్లా స్థాయి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



**దుద్యాల్, మార్చి 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల పూర్వ విద్యార్థి హకీంపేట్ గ్రామ ఉపసర్పంచ్ మహేష్ ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు బహుకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు పరీక్ష సమయంలో ఏకాగ్రతతో ఉండి 100 ఉత్తీర్ణత సాధించాలని, పై చదువులు బాగా చదివి జీవితంలో మంచి పేరు సంపాదించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో శంకర్, సీనియర్ ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులను ఆశీర్వదించారు.


ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలి కుటుంబానికి నూతన వస్త్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే.

## లింగారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం
**హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్ రూరల్, మార్చి 11, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గం లింగారెడ్డిగూడ గ్రామంలో లబ్దిదారురాలు మంజుల నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిబ్బన్ కట్‌చేసి గృహ ప్రవేశం చేయించారు. లబ్దిదారురాలు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే స్వయంగా నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలిపారు. పేదల సొంతింటి కల సాకారం చేయడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సొంతింటి కళ నేరవేర్చినందుకు లబ్దిదారురాలి కుటుంబ సభ్యులు సిఎం, ఎమ్మెల్యే శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ రాజు, ఉప సర్పంచి ఆశోక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏజెంట్లను సత్కరిస్తున్న బిజిఎం సతీష్

## రీజియన్లో రూ.535 కోట్ల ప్రీమియం
**యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డిజిఎం సతీష్**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ సంస్థ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ దేశ వ్యాప్తంగా ఇప్పటికే రూ.20 వేల కోట్ల ప్రీమియం సాధించామని హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజరు వీ.సతీష్ తెలిపారు. తమ రీజియన్ పరిధిలో తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లో రూ.610 కోట్ల ప్రీమియం చేపట్టాలని టార్గెట్ విధించగా ఫిబ్రవరి నాటికల్లా రూ.535 కోట్లు సాధించామని వెల్లడించారు. బుధవారం తాండూరు బ్రాంచి కార్యాలయాన్ని సందర్శించిన రీజినల్ డిజిఎం స్థానిక అధికారుల, ఏజెంట్లతో సమావేశమైనారు. రీజియన్‌లోని 70 బ్రాంచీలలో ఉత్తమ టార్గెట్లు సాధించడంలో తాండూరు ప్రధానమైనదని కొనియాడారు. ఈ బ్రాంచి పరిధిలో రూ.5.53 లక్షలు టార్గెట్ విధించగా ఇప్పటికే రూ.8.67 కోట్ల ప్రీమియం సాధించి 171 శాతం సక్సెస్ కావడం అభినందనీయమని అన్నారు. ఈ ఘనత సాధించడంలో శాఖ అధికారులు, ఏజెంట్లు సమిష్టి కృషి చేశారని చెప్పారు. మార్కెట్లో కొన్ని నకిలీ భీమా కంపెనీలు పుట్టుకొచ్చాయని ప్రచారం జరుగుతున్నందున వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుబాటులో బ్రాంచి ఆఫీసుల ఏర్పాటు చేసుకున్న యూనిటైడ్ ఇండియా బీమా కంపెనీ వినియోగదారులకు ఎల్లవేళలా ఉత్తమ సేవలు అందిస్తాయని చెప్పారు. ఆరోగ్య బీమా, వాహనాల బీమా, ప్రమాద బీమా, కంపెనీలు, అగ్ని ప్రమాదాల బీమా తదితర సేవలు అందిస్తున్నామని ఆయన వివరించారు. ప్రీమియం చెల్లించిన వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు పని చేస్తామని వివరించారు. రీజియన్‌లో తాండూరు శాఖను అగ్రస్థానంలో నిలబెట్టిన బ్రాంచిమేనేజరు సాయికృష్ణ, అధికారులు రాజాం విజయకుమార్, వినేష్, హర్ష, ఏజెంట్లు మల్లారెడ్డి, రాధిక, మహ్మద్ ఇస్మాయిల్ ను డీజీఎం ఘనంగా సత్కరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి విధించిన టార్గెట్లను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట రీజినల్ మేనేజరు తిరుపతి, మార్కెటింగ్ మేనేజరు ఏ.కుర్మయ్య తదితరులు ఉన్నారు.

## లింగంధన గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ


మహిళా సమైక్య భవన నిర్మాణానికి పూజ చేస్తున్న దృశ్యం

**కేశంపేట , మార్చి 7, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని లింగంధన గ్రామంలో మహిళల ఐక్యత, సాధికారత మరియు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మహిళా సమైక్య నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నాగిళ్ల వెంకట్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిళ్ల వెంకట్ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ,ఎంపిఓ చంద్ర కుమార్ రెడ్డి ఎంపీఓ కిష్టయ్య టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మీ ్మనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ లావణ్య,గుబ్బ సుదర్శన్, సెక్రటరీ శ్రీశైలం సిసి యాదయ్య నాగిళ్ళ రామస్వామి, గోపాల్ గౌడ్, రాములు, కృష్ణయ్య మహిళా సంగం అధ్యక్షురాలు మహేశ్వరీ, శివలింగం,శంకర్ యాద గిరి,బాలయ్య, బాలస్వామి,భీమయ్య ఇస్తరి. మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంపై గురువారం ఉదయం 10.30గంటల నుంచి వర్క్‌షాపును నిర్వహించటానికి సంబంధిత జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడు మున్సిపాల్టీల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, జిల్లా పరిధిలోని పలువురు అధికారులు పాల్గొననున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పరిష్కారం పలు అంశాలపై వర్క్‌షాపులో అవగాహన కల్పించనున్నారు. ..అదే విధంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలకు చెందిన చైర్మన్లు,(చైర్‌పర్సన్‌లు), వైస చైర్మన్లు, కౌన్సిలర్ల కోసం కలెక్టరేట్‌లో గురువారం శిక్షణా కార్యక్రమంను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో నూతనంగా గెలుపొందిన స్థానిక సంస్థల (మున్సిపాల్టీల) ప్రజాప్రతినిధులకు విధి నిర్వాహణ కోసం శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరిగింది. దీనిలో భాగంగానే ఇక మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పరిపాలన, విధులు, బాధ్యతలు, సమావేశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పలు అంశాలపై ఇటీవలనే మున్సిపాల్టీలకు గెలుపొందిన ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. నూతనంగా గెలుపొందిన మున్సిపాల్టీల ప్రజాప్రతినిధులు అందరు కూడ శిక్షణలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేయనున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలోనూ మున్సిపాల్టీల ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## ముదిరాజ్‌లు సంఘటితం కావాలి

**షాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** ముదిరాజ్లు సంఘటితం కావాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బైరమోని మల్లేష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం నగరంలో ఆయన నివాసంలో షాబాద్ మండలం కొమరబండ గ్రామానికి చెందిన చేవెళ్ల సు సుభాష్ చంద్రబోస్ ను ముదిరాజ్ సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీంవగా ఎన్నుకున్నారు.

అనంతరం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. నాపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగిం చిన జిల్లా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు మహేందర్, సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు లింగం, గౌరవఅధ్యక్షుడు కూర వెంకటయ్య, ప్రధానకార్యదర్శి మానయ్య, శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ వెంకటయ్య. సంఘం నాయకులు బుచ్చయ్య, గౌరీశ్వర్, నర్సింహులు, శ్రీశైలం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

## విద్య మనిషిని గొప్పగా తీర్చిదిద్దుతుంది

**మేడ్చల్, మార్చి 11, ప్రభాతవార్త :** మనిషి భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దే శక్తి విద్యకు ఉందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థినుల ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యే మన భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్పశక్తి అని, ప్రతి విద్యార్థిని మంచి విద్యతోపాటు స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకుని ముందుకు సాగితే సమాజంలో ఉన్నత స్థానాలను అందుకోవచ్చని తెలిపారు. అమ్మాయిల విద్య సమాజఅభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ఈ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

**మేడ్చల్, మార్చి 11, ప్రభాతవార్త :** మేడ్చల్ డివిజన్ పరిధిలోని అత్వెల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌ను మేడ్చల్ మున్సిపల్ బిజెపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్ పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ప్రేమ్ దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఇప్పుడున్న అన్ని రంగాల్లో మంచి అవకాశాలు దక్కించు కోవడానికి అస్కారం ఉందని అన్నాడు. విద్యార్థులు కష్టమనుకోకుండా ఇష్టపడి చదువుకోవడం వల్ల పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపాడు. కేంద్రం లోని బిజెఎ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రణాళికలు ప్రవేశ పెట్టినా రాష్ట్రప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోకపోవడంతో చదువు కోసం ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపించాడు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి లవంగ శ్రీకాంత్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాగం అర్జున్, ఎల్లంపేట మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు బండి విష్ణుమూర్తి, సాయి కుమార్, వంశీధర్ రెడ్డి, బాబు రాజు, మహేష్ గౌలికర్, నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌ను పంపిణీ చేస్తున్న ప్రేమ్ దాస్



పూడూరు మండలం కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షసామాగ్రిని అందజేస్తున్న సర్పంచ్ శివశంకర్ తదితరులు

## ఊరికి,కన్నవారికి మంచిపేరు తీసుకురావాలి

**సర్పంచ్ శివశంకర్,హెచ్ఎం రాజు**

**పూడూరు, మార్చి 11, ప్రభాతవార్త :** విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఊరికి,కన్నవారికి మంచిపేరు తీసుకురావాలని సర్పంచ్ శివశంకర్,ప్రధానోపాధ్యాయులు రాజు ఆకాంక్షించారు.బుధవారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలువచ్చే అవకాశం ఉందని గుర్తుచేశారు.పరీక్షా కేంద్రానికి గంటముందు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రశ్నపత్రం చేతికి అందినవెంటనే ముందుగా క్షుణ్ణంగా చదివి ఎలాంటి పొరపాట్లు లేకుడా వచ్చిన జవాబులను రాయాలని వివరించారు.పరీక్షల సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని,బైకుల డ్రైవింగ్ చేయకూడదని సూచించారు.ఈ సందర్భంగా మేముసైతం ఫౌండేషన్ చైర్మన్ రాకంచెర్ల పెంటయ్య,యువజన నాయకులు మొగ్రి అనీల్(చిన్న బందయ్య),చాకలి లింగంల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు పరీక్షాప్యాడ్‌లతోపాటు,జామెంటరీ బాక్సులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువానయ్య,నవీన్,షఫి,రాంచెంద్రయ్య, జ్ఞానేశ్వరి,స్వాతి,రాంప్రసాద్,గ్రామస్తులు సయ్యద్‌గౌస్,మొగ్రి అనీల్(చిన్న బందయ్య). వెంకట్‌స్వామిగౌడ్, రాజు, నర్సింలు, సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.




విడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న తుల్జారాంగౌడ్

## చదువుపై శ్రద్ధ పెట్టాలి

**మర్పల్లి మార్చి 11 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వయించి రాబోవు పదవ తరగతిపరీక్షలలో ఉత్తీర్ణులు కావాలనీ జీవితానికి పదవతరగతి కీలకమనీ, యస్సీ వసతిగృహం సంక్షేమాధికారితుల్జారాంగౌడ్ అన్నారు.బుధవారము పట్లూర్ యస్సీ బాలుర వసతిగృహంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి పదవ తరగతి పరీక్షలు అత్యున్నతమైనవనీ ఆయన అన్నారు.విద్యార్థులు ఉన్నత స్థితికి రావాలంటే పదవ తరగతి పరీక్షలు కీలకమనీ విద్య నేర్పిన ఉపాధ్యాయులకు,తల్లి తండ్రులకు మంచి పేరు రావాలంటే అందరు విద్యార్థులు ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణత పొంది తమతమ జీవితంలో ముందుకు ఎదుగాలనీ ఆయన అన్నారు.విద్యకు స్మార్ట్ ఫోన్లు అడ్డంకి అని, అవసరమైతే తప్పా ఫోన్ల జోలికి వెళ్ళకూడదనీ ఆయన అన్నారు.అభివృద్ధి చెందిన దేశాలలో 18 ఏండ్లవరకు ఫోన్లపై నిషేధం ఉన్నదనీ ఆయన సూచించారు .ఈకార్యక్రమంలో పీఆర్టీయు అధ్యక్షులు పి.లాలయ్య,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు

## దరఖాస్తులు స్వీకరణ

**పెద్దేముల్, మార్చి 11,ప్రభాతవార్త:** దేవాదాయ, ధర్మదాయశాఖ పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని మారుతి దేవాలయం,గోపాలక్రిష్ణ దేవాలయాలకు ధర్మకర్తల మండలి ఏర్పాటు (నూతన కమిటిల) కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఈఓ ప్రవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్‌లకు సన్మానం

**షాద్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారులు**

షాద్ నగర్, మార్చి 11, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ను, వైస్ చైర్మన్ అందే మొహన్ గార్లను వ్యవసాయ శాఖ ఏ డి ఏ రామాదేవి, ఫరూఖ్ నగర్ వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్, ఫరూక్ నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్ ,కేశంపేట ఏ ఓ శోభారాణి , కొత్తూరు ఏ ఓ గోపాల్, సన్మానించడం జరిగింది. కార్యక్రమం లో షాద్ నగర్ మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,పాల్గొనడం జరిగింది.



మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

# వైభవంగా ప్రేరణ పురస్కారాల పండుగ

**క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు**

**ధారూర్, మార్చి 11, ప్రభాత వార్త:** మండల కేంద్రంలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రేరణ పురస్కారాల పండుగ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలు విద్యార్థుల ఉత్సాహం మధ్య అత్యంత విజయవంతంగా ముగిశాయి. మండలంలోని 8 పాఠశాలల విద్యార్థుల మధ్య జరిగిన ఈ పోటీలు వారిలో జ్ఞానవికాసాన్ని, పోటీస్ఫూర్తిని పెంపొందించాయి. ఈ కార్యక్రమానికి కుక్కిందా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాలస్థాయి నుంచే ఇలాంటి పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ క్విజ్ పోటీలను సీనియర్ మెంటర్ తుల్జప్ప, మెంటర్లు రాజేందర్ మరియు మహేశ్వరి సమన్వయకర్తలుగా వ్యవహరించి పర్యవేక్షిం చారు.




ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో ఎంపిపిఎస్ నాగ సముందర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ఎంపిపిఎస్ కుక్కిందా పాఠశాల ద్వితీయ స్థానంలో నిలవగా, కాచారం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి పల్లెను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు.

రూ.30లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**షాద్‌నగర్ రూరల్, మార్చి 11, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండలంలోని పల్లెలను ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం లింగారెడ్డిగూడ గ్రామంలో రూ.30లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,

సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి పల్లెను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషి వల్ల గ్రామానికి ఇప్పటికే రరూ.29.70కోట్లతతో పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందని, త్వరలోనే ఐటీఐ కూడా రాబోతుందన్నారు. మాట తప్పని నేతగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాజు, ఉప సర్పంచి ఆశోక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## దండాలయ్యా.. ఉండాలయ్య..!

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లబ్ధిదారు పబ్బతి కలమ్మ**

**నందిగామ, మార్చి 11, ప్రభాతవార్త:** నన్ను భరించే భర్త లేడు. నాకు భూమి లేదు బుట్టలేదు, రెక్కాడితే గాని డొక్కాడలేని కటిక పేదరికం. మాకు ఒకే ఒక కుమారుడు. మా ఆయన ఉన్నన్ని రోజులు గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసి మమ్మల్ని పోషించాడు. నా భర్త ఈ లోకాన్ని వీడిన తరువాత నన్ను గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికురాలిగా పనిలో పెట్టుకున్నారు. నా పనితనం చూసి నాకు జిల్లా కలెక్టర్ ఉత్తమ పారిశుద్ధ కార్మికురాలుగా అవార్డు ఇచ్చారు. గత ఏడాదిలో కురిసిన వర్షాల కారణంగా నా ఇల్లు కురిసి నరకం అను భవించాను. ఎప్పుడో ఏ క్షణమో నేను చనిపోవడం ఖాయమని నా కుమారుని అత్తగారింటికి దత్తత పంపించాను. శిధిలావస్థకు చేరుకున్న నా పెంకుటిల్లుపై తాడిపత్రి వేసి వర్షపు నీటి దాటికి తట్టుకొని ఇన్నాళ్లు బతికాను. నా దుస్థితిని చూసి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దయాదాక్షి ణ్యాలతో, రెవెన్యూ అధికారులు, సర్పంచ్ కొమ్ము కృష్ణ సహకారంతో నాకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చింది. నాకు చాలా ఆనందంగా ఉంది. నేను చచ్చేంత వరకు ఈ సహాయాన్ని మర్చిపోలేను. నాకు ఇల్లు ఇచ్చిన ఎమ్మెల్యేకు, సర్పంచ్ కొమ్ము కృష్ణ, వార్డు సభ్యులందరికీ, రెవె న్యూ అధికారులకు, పాత్రికేయులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికురాలు కలమ్మ

### కాంగ్రెస్ వచ్చింది.. డబుల్ బెడ్రూం కల నెరవేర్చింది ..

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** గత ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణమైనప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదు.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిస్థాయిలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందుబాటులోకి తెచ్చి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించిందని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందె మోహన్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ అందె మోహన్ మాట్లాడుతూ ఇళ్ల విషయంలో జాప్యం కావడానికి కారణం అక్కడ సరైన సదుపాయాలు కల్పించకపోవడమే అని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వచ్చాక అదనపు నిధులు మంజూరు చేసి అక్కడ తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్డు సదుపాయాలు కల్పించాలని, తలుపులు, కిటికీలు బాగు చేయించారని వెల్లడించారు. భవిష్యత్తులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆదుకునేందుకు తాము సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎంతో ఆనందంతో అందె మోహన్ ను శాలువాలతో సన్మానం చేశారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మీడియా పరంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కొండ యాదయ్య, భూషం శీను, శ్రీదేవి, మంగ శేఖర్, నందిగామ శ్రీశైలం, రొంపల్లి కృష్ణ, చౌల రవి, అబ్బూ, అవేజ్, మంగరాజు, భాష, భూషం చిన్న, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ లను అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

### 18వ వార్డులో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ



డబుల్ బెడ్ రూమ్ ప్రొసీడింగ్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** సొంతింటి కోసం కలలుకనే నిరుపేదల స్వప్నాలను సాకారం చేయగలిగేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. పట్టణంలోని 18 వ వార్డులో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఇండ్ల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదనపుతుర్లు తెచ్చి ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. మొత్తం 12 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. కౌన్సిలర్ సంతోష్ బాయి, చందు, సీనియర్ నేత వావిలాల సజీవన్ ఇతర నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పక్కా ఇల్లు ఇచ్చాం.. ప్రగతి వెలుగులు తెస్తాం..



డబుల్ బెడ్ రూమ్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులందరికీ అందజేస్తున్నామని, భవిష్యత్తులోనూ అర్హులను గుర్తించి అందజేసే కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని 23వ వార్డులో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపట్టాలను బుధవారం ఆయన అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు అర్హులకు పక్కా ఇల్లు ఇవ్వడంతో పాటు, మరోవైపు 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా వార్డులన్నిటిని బాగు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో షాద్ నగర్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని వెల్లడించారు. 24 వ వార్డు కౌన్సిలర్ అగ్గనూరు విశాల, నేతలు ఎండీ ఇబ్రహీం, నందు, కిట్టు, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

**పూడూరు, మార్చి 11, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో బుధవారం శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం 3వవార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.కడ్మూరు,మిట్టకంకల్ తదితర గ్రామాలకు చెందిన భజన మండలీలు పాల్గొని శ్రీరాకంచెర్ల వెంకట దాసులవారి సంకీర్తనలు ఆలాపించారు.ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు పూజారులు తీర్థప్రసాదాలు అందజేయగా,ఆలయ కమిటీ అద్వర్యంలో అన్నదాన కార్యంక్రమాలు నిర్వహించారు.దీంతో గ్రామంఅంతా శ్రీ రామాంజనేయ నామస్మరణతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్,ఉప సర్పంచ్ మొగ్రి బందయ్య, మాజీ సర్పంచ్,శ్యాంకుమార్,నాయకులు భేరి రాంచెంద్రయ్య, భీంభరత్,మొగ్రి యాదయ్య,డి యాదయ్య,బుగ్గరాములు,మొగ్రి అనీల్(చిన్నబందయ్య),దశరథ,శేఖర్,మాణిక్యం,లక్ష్మయ్య పాల్గొని ఉత్సవాలకు సహకరించిన దాతలను సన్మా నించారు.



పూడూరు మండలం మిట్టకంకల్ అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు తదితరులు



మొక్కలు నాటుతున్న దృశ్యం

## మొక్కా మొక్కా.. నాటేద్దాం ఎంచక్కా..

**షాద్‌నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** మొక్కల పెంపకం ద్వారా పచ్చదనానికి ప్రాణం పోసి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అంటే మోహన్ లు మాట్లాడుతూ పచ్చదనంతో పట్టణాన్ని కళకళలాడేలా ప్రతి వార్డులో మొక్కలు నాటి వాటిని పెంచాలని పిలుపునిచ్చారు. వార్డు ప్రజలు కూడా మొక్కలను పరిరక్షి ంచే బాధ్యత చేపట్టాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంబంధిత వార్డ్ కౌన్సిలర్ నడికుడ శ్రావణి, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, ఆరవ వర్డ్ కౌన్సిలర్ రాజు నాయక్, 25వ వార్డు కౌన్సిలర్ పెంటయ్య, స్థానిక మైనార్టీ నేత జమ్రుద్ ఖాన్, మున్సిపాలిటీ మెప్మా సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జివికె ఇఎంఆర్ఐ ద్వారా ఉచిత 108 అత్యవసర సేవలు

**కొడంగల్,మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలలో ఒకటైన ఉచిత 108 అత్యవసర సేవలు,ఉచిత 102 అమ్మఒడి వాహన సేవలు ప్రజలకు నిరంతరం సేవలు అందించడంలో ముందంజలో ఉన్నాయని జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు.జిల్లాలోని కొడంగల్‌లోని స్దానిక 108 అంబులెన్స్,102 వాహన సేవలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ బుధవారం ఆకస్మిక చేశారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ షేక్ జాన్ సాహిద్ సేవల పట్ల ఆరా తీశారు. 108 అంబులెన్స్‌లోని పనిముట్లు మందులు,దస్త్రాలను పరిశీలించారు.అత్యవసర పరిస్దితుల్లో సేవలందించడంలో జాప్య చేయరాదని,వెంటనే స్పందించి వాహనం సంఘటన స్దలానికి చేరుకొని బాధితులకు తగు చికిత్స చేసి దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.అదేవిధంగా 102 అమ్మఒడి వాహన సేవలు నిరంతరం గర్భిణీ స్త్రీలకు సేవలందిండలో ముందుండాలని తెలిపారు .గర్భిణీలు 102 అమ్మఒడి వాహన సేవలను గర్భ సమయంలో నుండి డెలివరీ సమయంలో అలాగే డెలివరీ తరువాత ఎన్నిసార్లు ఆసుపత్రికి సందర్శించిన అన్ని సార్లు ఈ వాహన సేవలను ఇంటి వద్దనుండి ఆసుపత్రికి,ఆసుపత్రి దగ్గరనుండి ఇంటికి వినియోగించుకోవాలని,ఈ సేవలను ప్రజల్లో అవగాహన కొరకు ఆశ కార్యకర్తలు ముందుండాలని కోరారు.ఈ సేవలను ముందంజలో నడిపించడలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని,ప్రభుత్వ సమన్వయంతో పనిచేయుడం సంతోషంగా ఉందని తెలిపారు.అలాగే కొడంగలోని స్దానిక 108,102 అంబులెన్స్ వాహన సిబ్బంది,టెక్నిషియన్‌లు అంజనేయులు,వినయ్,డ్రైవర్లు వేణుగోపాల్,విజయ్‌కుమార్,సంజీవ్‌లను అభినందించారు.



మెడిసిటీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థినులు

## నేటి మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు

**సీనియర్ గైనకాలజిస్టు జయంతిరెడ్డి**

**మెడిసిటీ వైద్య కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు**

**మేడ్చల్, మార్చి 11, ప్రభాతవార్త:** సమాజంలో నేటి మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయని సీనియర్ గైనకాలజిస్టు, ది ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ (ఓజిఎస్‌హెచ్) అధ్యక్షురాలు డాక్టర్ జయంతిరెడ్డి అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామంలో గల మెడిసిటీ వైద్య కళాశాలలో బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితంతో పోలిస్తే నేటి మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు మెండుగా లభిస్తున్నాయన్నారు. పురుషులతో సమానంగా పోటీ పడుతున్న నేటి మహిళలు ధీటుగా పని చేస్తూ మంచి పేరు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిగా, ఉద్యోగినిగా, వైద్యురాలిగా అన్ని భాధ్యతలను నిర్వహిస్తున్న మహిళ కృషిని నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తిస్తున్నారని దానిని మరింత పెంచేలా కృషి చేయాల్సిన భాధ్యత మహిళలపై మరింతగా పెరిగిందన్నారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన షేర్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి ఎస్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తించి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి జరుపుకునే ఒక ముఖ్యమైన రోజు మహిళా దినోత్సవమని అన్నారు. ఈ రోజు మహిళల హక్కులను చాటిచెప్పడంతో పాటు సమాజ నిర్మాణంలో వారి పాత్రను గౌరవించడంపై అవగాహన కల్పిస్తోందని అన్నారు. నేటి మహిళలు అందివచ్చిన ఈ అవకాశాలను సద్వినియోగపరచుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల మహిళా వైద్యులు, సిబ్బంది, విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలేంద్ర, మెడిసిటి హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి గీత, ఆబ్స్టెట్రిక్స్ గైనకాలజి విభాగం హెడ్, ప్రొఫెసర్ బి కల్పన, మైక్రో బయాలజీ విభాగం హెచ్ కిరణ్మయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపిక, కృతి, మృణాళిక, పిజి, ఎంబిబిఎస్, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మరింత కృషిచేయాలి

**ప్రత్యేకాధికారి స్టీవెన్‌నీల్**

**పూడూరు, మార్చి 11, ప్రభాతవార్త :** అధికారులు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మరింతకృషిచేయాలని రాష్ట్ర బృందం ప్రత్యేకాధికారి స్టీవెన్‌నీల్ సూచించారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం పూడూరు మండలం పరిధిలోని గొంగుపల్లి,మన్నెగూడ గ్రామాలను సందర్శించి వాటర్ ట్యాంక్, పల్లెప్రకృతివనం,క్రిమిటోరియం, విలేజ్, శానిటషన్,నర్సరీలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయని,వీటిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మరింతకృషి చేయాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పాండు,ఎంపిఓ సుందర్,పంచాయతీ కార్యదర్శిలు మాణిక్యం ,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి స్టీవెన్‌నీల్,ఎంపిడిఓ పాండు

## పల్లెలకు కొత్త అందాలు తెచ్చిన ప్రగతి రహదారులు

**నందిగామ, మార్చి 11, ప్రభాతవార్త:** నందిగామ మండలం చేగూరు నుండి బుగ్గోనిగూడ వరకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యత పనులను బుధవారం చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ కొత్తగా రోడ్డు నిర్మించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రాకపోకలకు సౌకర్యవంతమై రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు. పల్లె ప్రజల చిరకాల వాంఛ నెరవేసినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల మంద శివశంకర్, మనుక సురేష్, కావలి భీమయ్య, మంచన్ పల్లి భాస్కర్ గౌడ్, పబ్బే ప్రవీణ్, గునుగుర్తి రాజశేఖర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గోనిగూడ బీటీ రహదారి పనులను పరిశీలించిన నాయకులు

## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి సత్కారం

**షాద్ నగర్, మార్చి 11, ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడుగా ఇటీవలే ఎన్నికైన వేం నరేందర్ రెడ్డినీ షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మరో సీనియర్ నేత తాండ్ర కాశినాథ్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షి ంచారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేదోడు వాదోడుగా ఉంటూ భవిష్యత్తులో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు వేం నరేందర్ రెడ్డి సేవలు ఎంత గానో దోహదపడతాయని వారు కొనియాడారు. వేం నరేందర్ రెడ్డికి వచ్చిన ఈ గుర్తింపు కాంగ్రెస్‌పార్టీకి కూడా ఎంతో గౌరవప్రదంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను సన్మానించిన ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సీనియర్ నేత కాశీనాథ్ రెడ్డి తదితరులకు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే

## పరిశుభ్రత ముఖ్యం

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 11, (ప్రభాతవార్త):** గ్రామాలను పరిశుభ్రంగ ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరి గూడెం మండలంలోని తుమ్మలపల్లి గ్రామం లో ఆయన పర్యటించారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కు సంబంధించి ఆరవ రోజు గ్రామ పంచాయతీలో చేపడుతున్న పనులు ,ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు క్లోరినేషన్ చేయడం గ్రామంలో రోడ్లను ఊడ్చడం అలాగే పల్లె ప్రకృతి వనాలను కలుపు తీయడం పనులు పర్యవేక్షించారు. అనవతరం వాటర్ మెన్ చాకల్ చెన్నయ్య శాలు వాలతో సన్మా నించారు. ఈ కార్య క్రమంలో పంచా యతీ కార్య దర్శి సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొ న్నారు.



వాటర్ మెన్‌ను సన్మానిస్తున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్